క్లుప్తంగా

విద్యాసామగ్రి పంపిణీ



విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

పెనుగొండ: ప్రతి విద్యార్థీ ఉన్నత లక్ష్యాలను ఏర్పరుచుకొని వాటిని సాధించడానికి విశేష కృషి చేయాలని ఆచంట ఎంవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.శ్రీదేవి అన్నారు. శుక్రవారం ఆచంట ఎంవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు నోట్ పుస్తకాలు, బ్యాగ్‌లను పంపిణీ చేశారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. స్థానిక టీడీపీ నాయకులు గోడవర్తి శ్రీరాములు విద్యార్థులకు తాగునీటి ఇబ్బందులు లేకుండా ఆర్‌ఓ వాటర్ ప్లాంట్ కూపన్లను అందించారని తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు రామలింగేశ్వరరావు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

ల్యాప్‌టాప్ అందజేత



గాయత్రికి ల్యాప్‌టాప్ అందిస్తున్న పాలకొల్లు రోటరీ క్లబ్ సభ్యులు

పాలకొల్లు అర్బన్: పట్టణానికి చెందిన పేద్దిబోయిన గాయత్రికి రోటరీక్లబ్ సభ్యులు రూ.40 వేలు విలువ చేసే ల్యాప్ ట్యాప్ శుక్రవారం అందజేశారు. గాయత్రి బీఎస్సీ పూర్తి చేసి ఐబీఎంలో సిస్టమ్ అడ్మినిస్ట్రేటర్‌గా ఎంపికై ంది. అయితే గాయత్రి తండ్రి శ్రీనివాస్ పట్టణంలో టీ విక్రయించుకుని జీవనం సాగిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో గాయత్రికి ల్యాప్‌టాప్ కొనుగోలు చేసే శక్తి లేకపోవడంతో రోటరీక్లబ్ సభ్యులు స్పందించి రూ.40 వేలు విలువ చేసే ల్యాప్‌టాప్ ను గాయత్రికి అందజేశారు. ఈ కార్యక్రమంలో రొటేరియన్ ముండూరి సుధాకర్, రోటరీక్లబ్ అధ్యక్షుడు రావాడ సతీష్, కార్యదర్శి జవ్వాజి కల్యాణ్, కోశాధికారి పోతాబత్తుల సత్యనారాయణ, రోటరీ అసిస్టెంట్ గవర్నర్ ముత్యాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ వాడకంపై అవగాహన



ప్రకాశం చౌక్‌లో వాహనదారులకు హెల్మెట్‌పై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

భీమవరం: భీమవరం మండల న్యాయ సేవా సంస్థ, ట్రాఫిక్ పోలీస్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం హెల్మెట్ వాడకంపై అవగాహన నిర్వహించారు. స్థానిక ప్రకాశం చౌక్ సెంటర్‌లో హెల్మెట్ లేకుండా మోటారు సైకిల్ నడుపుతున్నవారికి హెల్మెట్ ఆవశ్యకతను వివరించారు. ఈ సందర్భంగా భీమవరం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మొగ్గ్ల వెంకటరమణారావు, భీమవరం ట్రాఫిక్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జి.దాసు మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు మోటారుసైకిల్ నడిపే సమయంలో హెల్మెట్ తప్పక ధరించాలని, ఏదైనా ప్రమాదం జరిగితే తలకు గాయమై ప్రాణాలు కోల్పోయే ప్రమాదముందని వివరించారు. హెల్మెట్ లేని ప్రయాణం చట్టరీత్యా నేరమని మోటార్ వెహికల్ యాక్ట్ ప్రకారం శిక్షార్హులవుతారని చెప్పారు. హెల్మెట్ ధరించి వాహనం నడుపుతున్న వాహనదారులకు చాక్‌లేట్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్సై వై.నాగలక్ష్మి, న్యాయవాదులు ఉండవల్లి రమేష్ నాయుడు, వీవీ సుబ్బారావు, ఎన్ సుధీర్, పి.అంబేద్కర్, డి.రవికిరణ్, కె.జ్యోతి, ఆర్ సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

కంప్యూటర్ విద్యపై అవగాహన అవసరం



కోపల్లె జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులతో ఎస్ఆర్‌కేఆర్ కళాశాల బృందం

కాళ్ల: విద్యార్థులు ప్రాథమిక దశ నుంచి కంప్యూటర్ విద్యపై పూర్తి అవగాహన ఏర్పాటు చేసుకోవాలని భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కేవీ మురళీకృష్ణమరాజు పేర్కొన్నారు. కళాశాల ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ ఆధ్వర్యంలో కాళ్ల మండలం కోపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థిని విద్యార్థులకు డిజిటల్ ఫౌండేషన్ పేరిట ఎక్స్‌ప్లోరింగ్ కంప్యూటర్ బ్రెయిన్ అండ్ ఎంఎస్ ఆఫీస్ పేరిట 3 రోజుల పాటు వర్క్ షాప్ నిర్వహించారు. దీనిలో భాగంగా శుక్రవారం కంప్యూటర్ శిక్షణ పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా కళాశాల ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ కోఆర్డినేటర్ డాక్టర్ పి.భువనేశ్వర్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నిర్మలాదేవి మాట్లాడుతూ ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల తమ పాఠశాల విద్యార్థులు ఉన్నతికి అందిస్తున్న సహాయ సహకారాలకు ఆమె కృతజ్ఞతలు చెప్పారు.

ముంపు ముంగిట్లో వరిచేలు

- దర్భరేవు డ్రెయిన్ ఆటుపోట్లతో అసలు సమస్య
- రెండు గ్రామాల్లోని పొలాల్లో తరచూ నీరు నిలిచిపోతున్న వైనం



రామన్నపాలెం పంచాయతీ అడవిపర్రలో ముంపులో చేలు

మొగల్తూరు: మండలంలోని రామన్నపాలెం పంచాయతీ అడవిపర్ర, మొగల్తూరు పంచాయతీ కొత్త కాయలతిప్పలో వ్యవసాయ భూముల్లో తరుచూ నీరు నిలిచిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ముందుగా నారుమడులు వేసుకున్నా దర్భరేవు డ్రెయిన్ ఆటుపోటులకు నారుమడులు మునిగిపోతున్నాయి.. ముత్యాలపల్లి నుంచి ప్రారంభమయ్యే దర్భరేవు డ్రెయిన్ కొత్తకాయలతిప్ప, అడవిపర్ర సమీపం నుంచి ప్రవహిస్తుంది. అయితే డ్రెయిన్ ఆటుపోట్ల సమయంలో వ్యవసాయ భూముల్లో నీరు రోజుల తరబడి నిలిచిపోతుంది. మండలంలోనే అత్యధికంగా వరి సాగు చేసే గ్రామమైన అడవిపర్రలో ప్రస్తుతం సాగు విస్తీర్ణం తగ్గిపోయి వరి చేలన్నీ చేపల చెరువులుగా మారాయి. అయినా సాగుపై ఉన్న మమకారంతో కొంత మంది రైతులు వ్యవసాయాన్ని వదులుకోలేకపోతున్నారు.

శిథిలావస్థకు తూరలు

ముత్యాలపల్లి నుంచి ప్రారంభమైన దర్భరేవు డ్రెయిన్ మొగల్తూరు పంచాయతీ కొత్తకాయలతిప్ప, నరసాపురం మండలం పసలదీవి మీదుగా దర్భరేవు వరకు ప్రవహిస్తుంది. డ్రెయిన్ ఆయకట్టు పొడవునా గతంలో అమర్చిన తూరలు శిథిలావస్థకు చేరడంతో డ్రెయిన్ ఆటుపోట్లకు ఏడాది పొడవునా చేలు ముంపు బారిన పడుతున్నాయి, ముఖ్యంగా మొగల్తూరు పంచాయతీ కొత్తకాయలతిప్ప, రామన్నపాలెం పంచాయతీ అడవిపర్ర భూములు ఏడాది పొడవునా ముంపులోనే ఉంటాయి. డ్రెయిన్ ఆటుపోట్లతో పాటు భారీ వర్షాలు కురిసినా చేల్లో నీరు ఉండిపోవడంతో సాగు చేయలేకపోతున్నారు. రోజులు తరబడి నీరు నిలిచిపోవడంతో కొంత మంది రైతులు మాత్రం వ్యవసాయ భూములను చేపల చెరువులుగా మార్చేసుకున్నారు. గతంలో ఆ ప్రాంత రైతులు చేలు ముంపునకు గురువుతున్న విషయాన్ని అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టికి తీసుకెళ్లడంతో సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అయితే సమస్య మాత్రం ఎన్ని సంవత్సరాలైనా తీరలేదు. ముఖ్యంగా దర్భరేవు డ్రెయిన్‌పై కొత్తకాయలతిప్ప, పసలదీవిలోని గేదెల ఒంపు గట్టు వద్ద రెగ్యులేటర్ నిర్మిస్తే రైతుల సమస్యలు తీరతాయని రైతులు భావిస్తున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి కొత్తకాయలతిప్ప వద్ద రెగ్యులేటర్ నిర్మించి చేలను ముంపు నుంచి కాపాడాలని కోరుతున్నారు.

ముంపు నుంచి కాపాడాలి



ప్రతి ఏటా మా ప్రాంతంలోని చేలు ముంపులోనే ఉంటున్నాయి. దీంతో భూములున్నా సాగు చేసుకునే పరిస్థితి లేదు. దర్భరేవు డ్రెయిన్‌పై రెండు ప్రాంతాల్లో రెగ్యులేటర్ నిర్మించి, ఆయకట్టు పొడవునా ఉన్న తూరలు మారిస్తే ముంపు నుంచి బయటపడతాం.

– పిప్పళ్ల గోపి, పిప్పళ్లవారితోట

వీధి దీపాలు వెలగక అవస్థలు

నరసాపురం: పట్టణంలోని స్టేషన్‌పేట, చినమామిడిపల్లి ప్రాంతాల్లో కొన్ని రోజులుగా వీధి దీపాలు సవ్యంగా వెలగడం లేదు. దీంతో స్థానిక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రిపూట వీధి దీపాలు వెలగకపోవడంతో భయంభయంగా ఉంటుందని స్థానికులు వాపోతున్నారు. మున్సిపల్ అధికారులు దృష్టి పెట్టి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

రూ.50 చెల్లించి కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు పొందాలి

పెనుగొండ: గ్రామ సచివాలయాల్లో కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలకు రూ.50 చెల్లించి పొందవచ్చని ఎంపీడీఓ ఎస్.శ్రీనివాస దొర తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఓ ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం నిర్ణయించిన రుసుం చెల్లించి సచివాలయ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పబ్లిక్ టాయిలెట్లు లేక ప్రజల ఇబ్బందులు



ఆంధ్రా బ్యాంకు రోడ్డులో నిరుపయోగంగా ఉన్న ఓఎన్జీసీ సంస్థ నిర్మించి ఇచ్చిన టాయిలెట్స్

నరసాపురం: పట్టణంలో మార్కెట్ ప్రాంతానికి వచ్చిన జనానికి కనీసం మరుగు కూడా లేని పరిస్థితి. అవసరమైన ప్రాంతాల్లో పబ్లిక్ టాయిలెట్లు నిర్మించాలన్న ఆలోచన పురపాలకులు కానీ, మునిసిపల్ అధికారులు కానీ చేయకపోవడం గమనార్హం. బజార్‌లో మరుగులేక జనం ఇబ్బందులు పడుతున్నారు. మహిళల పరిస్థితి అయితే మరీ ఇబ్బందికరంగా ఉంది. నరసాపురం పట్టణం 31 వార్డులతో విస్తరించి ఉంది. పట్టణాన్ని ఆనుకుని చుట్టుపక్కల 50 పంచాయితీలు ఉన్నాయి. చుట్టుపక్కల గ్రామాల వారు అందరూ తెల్లారితే ముఖ్యమైన పనులపైనా, సరుకులు కొనుక్కునేందుకు పట్టణానికి చేరుకుంటారు. కానీ పట్టణంలో బస్టాండ్ నుంచి ప్రధాన మార్కెట్ పొడువునా శివాలయం సెంటర్ వరకూ, ఇటు మొగల్తూరు రోడ్‌లో మేదర్ల వంతెన నుంచి సబ్‌కలెక్టర్ కార్యాలయం వరకూ ఎక్కడా పబ్లిక్ టాయిలెట్లు లేవు. దీంతో రోడ్డు పక్కనే జనం ఆ అవసరం తీర్చుకుంటున్నారు. మహిళలైతే నానా ఇబ్బందులు పడుతున్నారు. అయితే ఆంధ్రా బ్యాంకు రోడ్డులో ఏడేళ్ల క్రితం ఓఎన్జీసీ సంస్థ టాయ్‌లెట్స్ నిర్మించి ఇచ్చింది. వాటినీ మున్సిపాలిటీ పట్టించుకోకపోవడంతో నిరుపయోగంగా మారాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి పట్టణంలో పబ్లిక్ టాయిలెట్లు కట్టించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేత

పాలకొల్లు సెంట్రల్/పాలకొల్లు అర్బన్: విద్యుత్ మరమ్మతుల్లో భాగంగా శనివారం పాలకొల్లు పట్టణంలో విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు నరసాపురం విద్యుత్ శాఖ ఈఈ బి.సురేష్ కుమార్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. అడవిపాలెం విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల నిమిత్తం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నామని వివరించారు. దీంతో పట్టణంలో బస్టాండ్ సెంటర్, బంగారువారి చెరువుగట్టు, శంభునిపేట, మెయిన్‌రోడ్డు, వరిధనం రోడ్డు, సుబ్బారాయుడు గుడి సెంటర్, వెంకటేశ్వర కాలనీ, పోస్టాఫీసు, కోడిగట్టు, మార్కుపేట, రామయ్య హాలు, యాళ్లవాని గరువు, బ్రాడీపేట బైపాస్ రోడ్డు, పెనుమదం రోడ్డు, లక్ష్మీనగర్ తదితర ప్రాంతాల్లో, అలాగే మండలంలోని పూలపల్లి, హౌసింగ్‌బోర్డు, రైల్వే గేటు, లజపతిరాయపేట, చందపర్రు, చిట్టివానిగరువు, చోడేపాడు, కొమ్ములగూడెం, భగ్గేశ్వరం, చింతపర్రు, సత్యనారాయణపురం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని స్పష్టం చేశారు. వినియోగదారులు ఈ అంతరాయానికి సహకరించాలని కోరారు.

మొగల్తూరులో..

మొగల్తూరు: కాళీపట్నం సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలలో శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట విద్యుత్ సరఫరా నిలిపేస్తామని ఈఈ బి.సురేష్‌కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. కాళీపట్నం తూర్పు, పడమర, పాతపాడు, జగన్నాథపురం, కొత్తోట, ముత్యాలపల్లి,వారతిప్ప, మోడి, నీటితిప్ప, దారితిప్ప గ్రామాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని స్పష్టం చేశారు.

పోడూరులో..

పోడూరు: పెనుమదంలోని 33/11 సబ్‌స్టేషన్‌లో మెయింటెనెన్స్ పనులు, 33కేవీ లైన్ మరమ్మతుల కారణంగా సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 వరకు విద్యుత్ సరఫరా నిలిపేస్తామని ఈఈ బళ్ల సురేష్ కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. పెనుమదం, అప్పన్నచెరువు, గుమ్మలూరు, పైడావ, రావిపాడు, రాజులగరువు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

పశుపోషణలో మెలకువలు పాటించాలి



కవిటంలో పశుగ్రాసాలపై అవగాహన కల్పిస్తున్న ఏడీ డాక్టర్ పి.జయకర్

పోడూరు: పాడిరైతులు పశుపోషణలో మెలకువలు పాటించాలని స్థానిక వెటర్నరీ ఏడీ డాక్టర్ పి.జయకర్ పిలుపునిచ్చారు. పశుగ్రాస వారోత్సవాల్లో భాగంగా కవిటంలో శుక్రవారం పశుగ్రాస ప్రాముఖ్యతపై అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో ఏడీ జయకర్ మాట్లాడుతూ అధిక పాలదిగుబడులు సాధించడంలో సూపర్‌నేపియర్ పశుగ్రాసం ప్రాముఖ్యతను వివరించారు. మండల పశువైద్యాధికారి డి.మాధురి మాట్లాడుతూ పాల దిగుబడులు, పశువులు చూడికట్టడం కోసం మేలుజాతి పశుగ్రాసాలైన సీఓ-03, సీఓ-4, సీఓ-5, ఏపీబీఎన్, లూసెర్న్, బెరసీమ్ ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో వెటర్నరీ సిబ్బంది, గ్రామానికి చెందిన రైతులు పాల్గొన్నారు.

ఆక్వా రైతులను ఆదుకోవాలి



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి భీమారావు

భీమవరం అర్బన్: రొయ్యలు, చేపలకు మార్కెట్‌లో సరైన ధర లేకపోవడంతో తీవ్ర నష్టాల ఊబిలో కొట్టుమిట్టాడుతున్న ఆక్వా రైతులను ఆదుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు కోరారు. భీమవరం మండలం నాగేంద్రపురం గ్రామంలో సీపీఐ మండల సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కోనాల భీమారావు మాట్లాడుతూ ఆక్వా పరిశ్రమల యాజమాన్యం సిండికేట్ ఏర్పడి చేపలు, రొయ్యలను తక్కువ ధరకు కొనుగోలు చేయడం దారుణమన్నారు. వనామీ రొయ్య 100 కౌంట్‌కు రూ.250 మద్దతు ధరకు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. విద్యుత్ సబ్సిడీ, రాయితీపై మేత సరఫరా చేసి నాణ్యమైన సీడ్ ఉత్పత్తి చేయాలన్నారు. ఆక్వా పరిశ్రమల్లో దినసరి మహిళా కూలీలకు కనీస వేతనం రూ.650 అమలు చేయాలన్నారు. దాళ్వా ధాన్యం బకాయిలు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. సార్వా పెట్టుబడి సాయంగా రైతులకు రూ.20 వేలు ఇవ్వాలని కోరారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇచ్చి పంట రుణాలు ఇవ్వాలని అన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు ఎంవీఎస్ బ్రహ్మం, సీపీఐ మండల కార్యదర్శి ఎం సీతారాం ప్రసాద్, తిరుమాని కామేశ్వరరావు, నాగిడి తులసీరావు, నాగిడి నాగరాజు, ఎన్. శ్రీనివాస్, నాగిడి రాము, వాటాల పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి ఏడుగురి ఎంపిక


పి హర్షిణి


కె. జాహ్నవి


పి. సౌజన్య


పి. భానుశ్రీ


ఎస్ ప్రియాంక


ఎన్. యామిని


జె అనూరాధ

పాలకొల్లు సెంట్రల్: పట్టణంలోని బీవీఆర్ఎం బాలికోన్నత పాఠశాల నుంచి పదవ తరగతి పాసైన ఏడుగురు విద్యార్థినులు ట్రిపుల్ ఐటీ ఎంపికయ్యారు. శుక్రవారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు వై. ప్రభాకరశాస్త్రి విలేకరులతో మాట్లాడుతూ ఇప్పటి వరకూ 28 మంది విద్యార్థినులు బీవీఆర్ఎం ఉన్నత పాఠశాల నుంచి ట్రిపుల్ ఐటీకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ సంవత్సరం పదో తరగతిలో అత్యుత్తమ ఫలితాలు సాధించిన 7 గురు విద్యార్థినులు పి.హర్షిణి, కె.జాహ్నవి, పి.సౌజన్య, పి.భానుశ్రీ, ఎస్.ప్రియాంక, ఎన్.యామిని, జె.అనూరాధ ట్రిపుల్ ఐటీకు ఎంపికయ్యారని వివరించారు. నూజివీడు కళాశాలకు 5 గురు, ఒంగోలు కళాశాలకు ఇద్దరు విద్యార్థినులు ఎంపికయ్యారన్నారు. విద్యార్థినులను విద్యాశాఖ ఆర్‌జేడీ నాగమణి, ఎంఈఓలు ఆర్ఎన్‌వీజీఎస్ శర్మ, గుమ్మళ్ల వీరాస్వామి తదితరులు అభినందించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం



వడలిలో ఆరోగ్య సిబ్బంది సర్వేను పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి మహేశ్వరరావు



అరట్లకట్టలో డ్రై డే ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పిస్తున్న ఆరోగ్య సిబ్బంది

పెనుగొండ: సీజనల్ వ్యాధులపై ఆరోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యాధికారి మహేశ్వరరావు అన్నారు. శుక్రవారం వడలిలో ఇంటింటి జ్వరాల సర్వేను పరిశీలించారు. ఆరోగ్య సిబ్బంది ప్రతి రోజూ ఇంటింటికీ వెళ్లి జ్వరం కేసులపై తప్పనిసరిగా సర్వే చేయాలన్నారు. వాటి నివేదికలను ఎప్పటికప్పుడు జిల్లా కార్యాలయానికి పంపాలన్నారు. అదే విధంగా ప్రజలకు వ్యాధులపై అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో సీహెచ్ భృంగేశ్వరరావు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

తామరాడలో

సిద్ధాంతం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని తామరాడలో శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. నీరు నిలువ ఉంచడం వల్ల దోమల వృద్ధి చెంది వ్యాధులు, జ్వరాలు పెరిగే అవకాశం ఉందని ప్రజలకు అవగాహన కల్పించారు. జ్వరం వస్తే తక్షణం వైద్యులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో యూనిట్ అధికారి జి.వెంకటేశ్వరరావు, వై.శ్యామల, భృంగేశ్వరరావు, పి.లక్ష్మీ దుర్గ పాల్గొన్నారు.

పాలకొల్లులో..

పాలకొల్లు అర్బన్: సీజనల్ వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని మెడికల్ ఆఫీసర్ అడ్డాల ప్రతాప్‌కుమార్ అన్నారు. పాలకొల్లు మండలంలోని అన్ని గ్రామాల్లో డ్రై డే సందర్భంగా శుక్రవారం ర్యాలీలు, అవగాహన సదస్సులు నిర్వహించారు. మండలంలోని అరట్లకట్ట గ్రామంలో జరిగిన అవగాహన సదస్సులో డాక్టర్ ప్రతాప్‌కుమార్ మాట్లాడతూ ఇంటి పరిసరాల్లో మురుగుగుంటలు లేకుండా చూసుకోవాలని సూచించారు. ఎవరైనా జ్వరాలు, వాంతులు, విరోచనాలతో బాధపడుతుంటే ఏఎన్ఎం లేదా ఆశ వర్కర్‌ని సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు చింతపల్లి సాయిబాబా, మెడికల్ ఆఫీసర్ ఎం.నవ్యజీవన్, మలేరియా సబ్ యూనిట్ అధికారి రాజ్‌కుమార్, ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు, పీహెచ్ఎన్ పి ఎలిజబెత్, సూపర్‌వైజర్లు ఎస్‌కే అమలేశ్వరరావు, డి.కమల తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులు జాగ్రత్తలు తీసుకోవాలి



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

కాళ్ల: గర్భిణులకు వంద రోజుల ప్రత్యేక అవగాహన కార్యక్రమాల్లో భాగంగా ఐఈఈ ఆధ్వర్యంలో శుక్రవారం కాళ్ల ప్రభుత్వాసుపత్రి వద్ద సమావేశం నిర్వహించారు. సూపర్‌వైజర్ కె.సూర్యకుమారి ఆధ్వర్యంలో గర్భిణులు, మహిళలు, బాలికలకు కాళ్ల పీహెచ్‌సీలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పీఎంఎంవీవై స్కీమ్‌లో గర్భిణులు తమ పేర్లు నమోదు చేయించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు. సరాబు సునీల్ మాట్లాడుతూ గర్భిణులు ఆహారం, ఆరోగ్యపరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు.

సాగు సాయమెప్పుడో..?



ఏపుగా ఎదిగిన నారుమడి

యలమంచిలి: ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది. రైతులు వేసుకున్న నారుమడులు ఊడ్చడానికి సిద్ధమయ్యాయి. ఈ నేపథ్యంలో రైతులు సాగు పెట్టుబడుల కోసం ఎదురుచూస్తున్నారు. గత ఐదేళ్లుగా ఈ సమయంలోనే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పీఎం కిసాన్ కింద రూ.2 వేలు, వైఎస్సార్ రైతు భరోసా కింద రూ. 5500 కలిపి మొత్తం రూ. 7500 అందించేవి. ఊడ్పులకు, మొదటి విడత ఎరువులకు ఈ డబ్బులు రైతులకు అక్కరకు వచ్చేవి. పెట్టుబడి కోసం ప్రైవేట్ వడ్డీ వ్యాపారుల వద్దకు వెళ్లాల్సిన అవసరం ఉండేది కాదు.

ప్రభుత్వ సహాయం కోసం ఎదురుచూపులు

ప్రతి సంవత్సరం ఖరీఫ్ ప్రారంభ సమయంలో ప్రభుత్వ సహాయం అందడంతో గత ఐదేళ్లుగా రైతులు ఖరీఫ్‌ను ఉషారుగా ప్రారంభించేవారు. సూపర్ సిక్స్ పథకంలో భాగమైన రైతులకు రూ.20 వేలు ఆర్థిక సహాయం విషయంలో ఇంత వరకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రకటన రాకపోవడంతో రైతులు ఆలోచనలో పడ్డారు. పీఎం కిసాన్ పథకంలో భాగంగా 17వ విడత నిధులు రూ.2 వేలు గత నెలలోనే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విడుదల చేశారు. కానీ రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రకటన రాకపోవడంతో అప్పు చేయాలా? లేదా రాష్ట్ర ప్రభుత్వం డబ్బులు ఇస్తుందా? అని ఎదురు చూస్తున్నారు. పెట్టుబడి పెట్టాల్సిన కీలక సమయంలో ఇలాంటి సంకటస్థితిపై రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మండలం	సాగు భూమి	రైతులు
పాలకొల్లు	9680 ఎకరాలు	4523
పోడూరు	13250 ఎకరాలు	5518
యలమంచిలి	5512 ఎకరాలు	3652